# గన్నేరు

# 10

అదు గదుగో ఆ యెదుట సందు మొదట ఇటుకలు బయటఁబడ్డ ఆ పాత యిల్లున్నదే ఆ యింట్లోనే ఆ అమ్మాయి ఉంది.

ఆ అమ్మాయి తండ్రి చాలా నిష్ఠాపరుడు. రోజూ దేవపూజ చేస్తాఁడు. ఇంట్లో భోనేశ్వరం ఉంది, ఆ అమ్మాయి ఇంట్లో దేవుణ్ణి పూజించడానికి పొద్దున్నే పూలుకోస్తుంది. ఆ అమ్మాయి చిన్నది. చంపకం లాంటి రంగు. ఒంటిమీద ఉతికి ఆరవైచిన బట్ట పాలతెలుపు. రోజూ చక్కగా మొహం కడుక్కొని కుంకుమ పెట్టుకోదు. పసుగెత్తుకో వస్తూంది. చెక్కిళ్లు పాలు కారుతున్నాయి.

దొడ్లో ఒకపక్క ఓరగా గన్నేరుచెట్లు ఉన్నాయి. ఎఱ్ఱగన్నేరు పచ్చగన్నేరు రకరకాల గన్నేరులు. వాట్లకు తియ్యకుండా ఎప్పుడూ పూలు. కింద మోఁకాలి ఎత్తున భూదేవిని స్వయంగా పూజిస్తవి.

ఆ అమ్మాయి అక్కడికి వెళ్ళి కింద బడ్డపూలు పోగుచేయడానికి రెండుమూడు సార్లు వంగింది. ఆఁగి వెంటనే చేతులను వెనుకకు లాఁగుకుంది. ధూళిలో పడ్డపూలు దేవపూజకు పనికిరావని ఆ అమ్మాయి తండ్రి చెప్పాడు. ఆ అమ్మాయి ఆలోచింపసాగింది. కింద పడిపోయిన పూలు ఎందుకు పనికిరావు? అవి ఏమి దోషం చేసినవి? వాట్ల తప్పేమిటి?

వాళ్ళ ఇంటిపక్క పచ్చరంగు వేసిఉన్న ఆ యిల్లు ఖాళీ అయింది. అందులో ఎవరో అద్దెకు వున్నారు. ఆ యింట్లో ఇద్దరు అమ్మాయిలు ఆ అమ్మాయి ఈడువాళ్ళు ఉన్నారు. వాళ్లు ఆ పూలచెట్ల కిందికి వచ్చారు.

వాళ్లు పూలు ఏఱుకోపోవడానికి రెండు చిన్న బుట్టలు తెచ్చారు.

ఆ అమ్మాయి అడిగింది— "మీ యింట్లో దేవతార్చన లేదు గదా! పూలు ఎందులకు మీకు?"

వాళ్ళిద్దరూ అన్నారు— "అమ్మాయీ! మేము రోజు రోజూ గన్నేరు పూలు పోగుచేస్తాము. పోగుచేసి రంగుతొట్టెలో ఎండఁబెడతాము. అది రంగు ఔతుంది. వాట్లతో బట్టలకు రంగుః అద్దవచ్చు. ఇదిగో ఈ రంగు."

పూజకు పూలు కోయడం సమాప్తం అయింది. తరువాత కింద ఉన్నపూలు కూడా చెంగులోకి ఎత్తుకుంది. ఇంకా రాలేదేమని తండ్రి దేవగృహంలోంచి బయటికి వచ్చి అన్నాడు— "ఓసి పిచ్చిదానా! కింద పడ్డ పూలు లెందుకోసమే?"

"అదుగో ఆ అమ్మాయిలు కట్టుకున్న బట్టలలాంటి రంగు నేనూ అద్దించుకుంటాను" అని అన్నది కూఁతురు.

తండ్రి ఈ మాటలువిని మొహం తిప్పుకొని వెళ్ళిపోయాడు. ఇంట్లోంచి పరుగెత్తుకో వచ్చి, ఆ అమ్మాయి తల్లి మెల్లలో ఉన్న బోషాణం వెనకాల కనఁబడకుండా ఏడుపు మొదలెట్టింది. "ఓసి పాపిష్ఠిదానా! నీకు రంగుబట్టలు కట్టుకునే పుణ్యమేదే? బతికినన్నాళ్ళు నీకు తెల్లబట్టేనే!" అని చీత్కరించింది.

ఆపిల్ల లిద్దఱు ఈ మాటలన్నీ విని, తెల్లపోయి ఆ అమ్మాయి తెల్ల బట్టకేసి చూచారు. ఏమనుకున్నారో ఒక్కటే పరుగు! గన్నేరు పూలన్నీ కింద పడిపోయినాయి.

జీర్ణించి పోయిన పాంతశోకం కొత్తదైంది తల్లి ఏడుపు ఆగలేదు.

ఆ దారినపోయే నరకంఠీరవ శాస్త్రుల్లు వృద్ధు "ఎందుకమ్మా! అమంగళంగా పొద్దున్నే ఏడుస్తున్నావు? అయింది అప్పుడే అయిపోయింది. మీ కన్యాదానఫలం మాత్రం వృథాపోతుందని శాస్త్రంలో లేదు. ఈ మాట రూఢిగా నమ్మ" అని వెళ్ళిపోయాడు.

౩

మూడు నాలుగేళ్ళు గడిచిపోయినవి. ఆ అమ్మాయికి ఇప్పుడు తన అవస్థ తెలిసింది. పొరుగింట్లో డోలు, సన్నాయి వినబడుతున్నవి. ఆ యిద్దఱు అమ్మాయిలకూ పెళ్ళి. ఒక సుముహూర్తంలోనే ఇద్దఱకు మంచి సంబంధాలు వెతుక్కువచ్చాడు వాళ్ళ తండ్రి. రాత్రి లగ్నం.

వారి యింటికి ఆ అమ్మాయి తల్లి వెళ్ళింది. ఆ అమ్మాయి వెళ్ళ లేదు. పెళ్ళికి ముత్తైదువలు పోతారుకాని ఆ వెధవ అమ్మాయి రాక్షసో డాకినో కాదూ! పైగా పెళ్ళియింటికి అమంగళం!

పెండ్లికి ముందు ఆ యింటి ముంగిటికి రెండు పాలక్కీలు వచ్చి దిగినవి. వాకట్లో మనుష్యులు కోలాహలం చేస్తున్నారు. ఎన్నో దివిటీలు, ఎన్నో మేళాలు! పెళ్ళి కొడుకులు వచ్చే దారినిండా ఎన్నో రకాల పూలు!

ఆ అమ్మాయి కిటికీ తెఱచి ఒకసారి అటొత్తి చూసింది పాలక్కీలో నించి ఎవరో దిగారు. సప్తసముద్రాలకు ఆవలినుంచి వచ్చిన రాజకుమారులు లాగా ఉన్నారు.

రాత్రి చాలా పొద్దోయింది. పెళ్ళిబాజాలు ఆగాయి. ఆ అమ్మాయి తల్లి తిరిగి ఇంటికి వచ్చింది; చూచింది. ప్రమిదలో ఆముదం తగ్గడంవల్ల దీపం నకనకలాడుతూంది ఆ అమ్మాయి కిందపడి ఉంది. తల్లి ఆ అమ్మాయి ముఖంకేసె చూసింది. ఆమె గుడ్లు అల్లాగే నిలబడి పోయినయ్.

★★